



Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 244 | మంగళవారం 24 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఇజ్రాయిల్ పర్యటన కోసం
# ఎదురుచూస్తున్నాను

**- ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రాబోయే ఇజ్రాయిల్ పర్యటన కోసం ఎదురుచూస్తు న్నానని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పోస్ట్ కు ప్రతిస్పందనగా ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. బుధవారం జరిగిన క్యాబినెట్ లో ప్రధాని మోదీ పర్యటన గురించి ప్రస్తావించినట్లు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు పోస్టు చేశారు. దీనిపై భారత ప్రధాని ప్రతిస్పందిస్తూ... "నా స్నేహితుడు, ప్రధాన మంత్రి నెతన్యాహుకు ధన్యవాదాలు. భారతదేశం -- ఇజ్రాయెల్ మధ్య బంధం, మా ద్వైపాక్షిక సంబంధాల వైవిధ్యం గురించి నేను మీతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. నమ్మకం, ఆవిష్కరణ, శాంతి మరియు పురోగతి పట్ల ఉమ్మడి నిబద్ధతపై నిర్మించిన ఇజ్రాయిల్‌తో శాశ్వత స్నేహాన్ని భారతదేశం ఎంతో విలువైనదిగా భావిస్తుంది. నా రాబోయే ఇజ్రాయిల్ పర్యటన సందర్భంగా చర్చల కోసం ఎదురు చూస్తున్నాను" అని మోదీ పోస్టులో పేర్కొన్నారు.

## పనితీరు ఆధారంగా
# ఉద్యోగులకు వెయిటేజ్...

- సీఎం చంద్రబాబు కొత్త విధానం
- ఉత్తమ పనితీరు కనబరిచే వారికి అభినందన లేఖలు పంపాలని ఆదేశం
- రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి, ఫ్రెష్ లుక్ తీసుకురావాలని దిశానిర్దేశం
- ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచన
- టెక్నాలజీ ఆధారిత సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ

అమరావతి - సూర్య వాస్తవం




ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం పెంచడంతో పాటు, ఉద్యోగుల్లో నూతనోత్సాహం నింపే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ఉద్యోగుల పనితీరు ఆధారంగా వారికి వెయిటేజ్ ఇవ్వాలని, ఉత్తమ పనితీరు కనబరిచే వారిని గుర్తించి ప్రభుత్వం తరపున అభినందన లేఖలు పంపాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించే ఈ నూతన విధానాన్ని ప్రకటించారు. క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు పొందుతూ, అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పనితీరు సరిగా లేని వారిని గుర్తించి ప్రేరణ కల్పించడంతో పాటు, బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసించడం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని ఉన్నతాధికారులు సైతం ఏకీభవించారు. "ప్రతి నెలా ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను గుర్తించి, వారికి అభినందన లేఖలు పంపాలి. ఈ ప్రశంసలను వారి సర్వీస్ రికార్డులలో కూడా నమోదు చేయాలి. ఇది వారి కెరీర్‌కు దోహదపడుతుంది," అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విధానం ప్రభుత్వ ఉద్యోగులను అభినందించడంలో ఒక కొత్త అధ్యాయమని, దీని ద్వారా పాలనలో మరింత సానుకూల మార్పు వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

**ఆసుపత్రులు, దేవాలయాలపై ప్రత్యేక దృష్టి**

వైద్యారోగ్యం, దేవదాయ శాఖల పనితీరుపై సమీక్షిస్తూ - మిగతా 2లో..

# దీపక్ కుమార్‌ను
# కలిసిన రాహుల్ గాంధీ

హైదరాబాద్ - సూర్య వాస్తవం



హిందూత్వ శక్తుల వేధింపుల ఘటనలో ఒక ముస్లిం దుకాణదారుడికి మద్దతుగా నిలబడి, తనను 'మహ్మద్ దీపక్'గా పరిచయం చేసుకున్న ఉత్తరాఖండ్‌కు చెందిన జిమ్ యజమాని దీపక్ కుమార్‌కు దేశవ్యాప్తంగా మద్దతు వెల్లువెత్తుతోంది. ఈ జాబితాలో రాజకీయ నాయకులు, సినీ నటులు, సామాజిక కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు, నెటిజన్లు కూడా ఉన్నారు. తాజాగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ జిమ్ ట్రైనర్ దీపక్ కుమార్‌ను కలుసుకున్నారు. సోమవారం ఆయన నివాసానికి వెళ్లి రాహుల్ మద్దతుగా నిలిచారు.

**ఏం జరిగింది..?**

గతనెల రిపబ్లిక్‌డే రోజు ఉత్తరాఖండ్‌లోని కోట్ద్వార్‌లో నాలుగు దశాబ్దాలుగా నడుస్తున్న 'బాబా స్కూల్ డ్రస్ అండ్ మ్యాచింగ్ సెంటర్' అనే దుకాణంపై వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారు దుకాణ యజమాని వకీల్ అహ్మద్(71) మతాన్ని ప్రస్తావిస్తూ పేరు మార్చాలని ఒత్తిడి తెచ్చారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడికి వచ్చిన దీపక్ కుమార్ కలుగజేసుకున్నాడు. ఆయనకు మద్దతుగా నిలిచాడు. 'నువ్వు ఎవరు?' అని ప్రశ్నించిన వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలకు 'మేరా నామ్ మహ్మద్ దీపక్' అని చెప్పాడు. దీంతో దీపక్ చెప్పిన ఆ ఒక్క మాటకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దేశవ్యాప్తంగా దీపక్‌కు మద్దతు పెరిగిపోయింది. నెటిజన్లంతా దీపక్ చర్యను సమర్థిస్తున్నారు. మతోన్మాద హిందూత్వ శక్తులకు ఆయన సరైన సమాధానం చెప్పాడని కొనియాడుతున్నారు.

## హార్వర్డ్ నుంచి
# సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- తెలంగాణ ఏఐ సిటీ విజన్‌కు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు
- ఏఐ మౌలిక వసతులపై మాట్లాడనున్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి అరుదైన ఆహ్వానం అందింది. మార్చి 27న జరగనున్న 'ఏఐ పాలసీ సింపోజియం'లో ప్రసంగిం చాల్సిందిగా ఆహ్వానించినట్లు ముఖ్య మంత్రి కార్యాలయం (సీఎంఓ) ఒక ప్రకటనలో తెలిపింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లోని బిజినెస్ అండ్ గవర్నమెంట్ ప్రోగ్రామ్, ఏఐ అండ్ టెక్ పాలసీ కాకస్ సంయుక్తంగా ఈ సింపోజియంను నిర్వహిస్తున్నాయి. 'ఏఐ యాజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కంప్యూట్ పవర్: ఇంపాక్ట్ ఆన్ లివబిలిటీ & వర్క్‌ఫోర్స్' అనే అంశంపై జరిగే ప్యానెల్ చర్చలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. డేటా సెంటర్లు, ఇంధన వ్యవస్థలు, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన ఏఐ విస్తరణకు అవసరమైన నైపుణ్యాల కల్పన వంటి అంశాలపై ఈ సెషన్‌లో - మిగతా 2లో..



## తిరుమల లడ్డూ వివాదం..
# ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట

2



# బంగారం ధరల పెరుగుదలకు కారణం అదే

- కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయన్న నిర్మలా సీతారామన్
- బంగారం దిగుమతులపై ఆందోళన చెందడం లేదన్న నిర్మలా సీతారామన్
- పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని విజ్ఞప్తి

2



## ప్రభుత్వ వైఫల్యమే
# కారణం..

- కల్తీ పాల ఘటనపై జగన్ ఫైర్
- రాజమండ్రిలో కల్తీ పాలతో నలుగురి మృతి!
- ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- ఒకే పాల వ్యాపారి నుంచి పాలు కొన్న బాధితులు
- పలువురి పరిస్థితి విషమం.. ఆసుపత్రిలో చికిత్స

2

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## ఆ మ్యాచ్ కూడా
# స్టేడియంకు వెళ్లి చూస్తా

- జగన్‌కు నారా లోకేశ్ కౌంటర్
- భారత్ టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు వెళితే ఆ మ్యాచ్ తప్పక చూస్తానన్న లోకేశ్
- అవసరమైతే జగన్‌కు కూడా టికెట్ కొనిస్తానని సెటైర్
- వైసీపీ హయాంలో సాక్షి, భారతి సిమెంట్స్‌కు రూ.1000 కోట్ల లబ్ధి అని ఆరోపణ
- హెరిటేజ్‌కు ప్రభుత్వ లబ్ధి చేకూరలేదని స్పష్టీకరణ
- బడ్జెట్‌పై చర్చ కోరేవాళ్లు సభను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్న

2

# హార్వర్డ్ నుంచి
# సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)
చర్చిస్తారు. భారత్ ఫ్యూచర్ సిటీ చొరవలో భాగంగా తెలంగాణలో 'ఏఐ సిటీ' నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికత, నాయకత్వానికి ఈ ఆహ్వానం ఒక గుర్తింపు అని సీఎంఓ పేర్కొంది. ఏఐ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో భూ కేటాయింపులు, విద్యుత్ మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాల్లో రేవంత్ రెడ్డి పాలనా అనుభవం ప్రపంచ విధాన రూపకర్తలకు, పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల ఆధారిత అభివృద్ధిలో తెలంగాణ నాయకత్వానికి పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపునకు ఈ ఆహ్వానం నిదర్శనమని చెప్పవచ్చు. ఇటీవల ముఖ్యమంత్రి అమెరికాలో పర్యటించినప్పుడు ఈ సింపోజియం నిర్వాహకులు ఆయనతో సమావేశమై ఈ కార్యక్రమం గురించి చర్చించారు.

# తిరుమల లడ్డూ వివాదం..
# ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట

**- ఏకసభ్య కమిషన్ ఏర్పాటును సవాలు చేసిన సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ కొట్టివేత**
**- కమిటీ విచారణ కొనసాగించవచ్చని స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం**
**- సిట్, కమిటీ దర్యాప్తులు వేర్వేరని, ఒకదానిపై ఒకటి ప్రభావం చూపవని వెల్లడి**
**- రిటైర్డ్ ఐఏఎస్ దినేశ్‌కుమార్ కమిటీ నివేదికకు మార్గం సుగమం**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలకు సంబంధించిన వివాదంలో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణను కొనసాగించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కమిషన్ నియామకాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇవాళ కీలక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తిరుమల నెయ్యి వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ సిట్ దర్యాప్తు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా మరో కమిటీని ఎలా ఏర్పాటు చేస్తుందని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సీఎం చంద్రబాబు, టీటీడీ, సీబీఐని ప్రతివాదులుగా చేర్చారు. స్వామి వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. ఒక దర్యాప్తు సంస్థ విచారణ మరో కమిటీపై ప్రభావం చూపదని స్పష్టం చేసింది. "రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ పరిపాలనాపరమైన లోపాలను గుర్తించేందుకు ఏర్పాటు చేయబడింది. ఇది సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేస్తుందని మేము భావించడం లేదు. చట్ట ప్రకారం సిట్, ఏకసభ్య కమిటీ తమ తమ విధులను నిర్వర్తించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. ఈ రెండు విచారణలు వేర్వేరని, ఒకదాని పరిధిలోకి మరొకటి రాదని (ఓవర్‌లాపింగ్ కాదని) తేల్చి చెప్పింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం నెయ్యి కొనుగోలు టెండర్లు, నిబంధనల సడలింపులో లోపాలు జరిగాయని సీబీఐ సిట్ తన నివేదికలో ప్రభుత్వానికి వెల్లడించింది. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా ఎవరిపై, ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 45 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈ కమిటీని ఆదేశించింది.తాజాగా సుప్రీంకోర్టు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దినేశ్‌కుమార్ కమిటీ తన విచారణను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

# ఏపీ అసెంబ్లీలో జైళ్ల సంస్కరణల బిల్లుకు ఆమోదం

**- ఖైదీలకు క్షమాభిక్షపై హోంమంత్రి కీలక ప్రకటన!**

అమరావతి,- సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జైళ్లలో మగ్గుతున్న ఖైదీల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈరోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల 8వ రోజున రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత 'జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లు'ను ప్రవేశపెట్టగా, సభ దీనికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అనిత, జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా సంస్కరణాలయాలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, కేంద్రం నిర్దేశించిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ సంస్కరణలు అమలు చేస్తామని ఆమె ప్రకటించారు. జైలు గోడల మధ్య కూడా మానవీయ విలువలు కాపాడాలన్న ఉద్దేశంతో మహిళా ఖైదీల పిల్లల కోసం ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా వారిని కేటగిరీలుగా విభజించి, వారిలో మానసిక పరివర్తన తెచ్చేందుకు 'ఓపెన్ ఎయిర్ జైళ్ల'ను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా వ్యవసాయం మరియు ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, వారు చదువుకునేందుకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. జైళ్లలో సిబ్బంది కొరత, ముఖ్యంగా మహిళా సిబ్బంది లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన సభ దృష్టికి తెచ్చారు.

# పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్...

(మొదటిపేజీ తరువాయి)
సీఎం పలు కీలక సూచనలు చేశారు. "ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకు అన్ని స్థాయిల్లో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బాధ్యులను చేయండి. పారిశుద్ధ్యం, వైద్య పరికరాల నిర్వహణపై ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు పూర్తి బాధ్యత అప్పగించాలి. ఏ ఆస్పత్రిలోనూ వైద్యుల కొరత ఉండకూడదు. అవసరమైన చోట తక్షణం నియామకాలు చేపట్టేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోండి" అని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే, దేవాలయాల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూడాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు.

**రెవెన్యూకు ఫ్రెష్ లుక్.. టెక్నాలజీతో అవగాహన**

రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. గతంతో పోల్చుకుంటే స్పష్టమైన మార్పు కనిపించాలి. ఈ శాఖకు ఒక ఫ్రెష్ లుక్ తీసుకురావాల్సిన అవసరం ఉంది. రీ-సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించాలి. రెవెన్యూ సేవలను పూర్తిగా ఆటోమేషన్ పరిధిలోకి తెస్తాం. ఎవరైనా అవినీతికి పాల్పడితే ఏసీబీని రంగంలోకి దించాల్సి వస్తుంది. సరిగా పనిచేయని తహసీల్దార్లను పక్కనపెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దు" అని హెచ్చరించారు. అదేవిధంగా, తాగునీటి సరఫరాలో నాణ్యతను కాపాడాలని, ఎప్పటికప్పుడు నీటి నమూనాలను పరీక్షించాలని ఆదేశించారు. ల్యాబ్‌లు అందుబాటులో లేని ప్రాంతాల్లో మొబైల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ఆడిట్ నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టాలని రవాణా శాఖకు సూచించారు.

ప్రభుత్వం టెక్నాలజీ సాయంతో అందిస్తున్న సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు మీ-సేవ కేంద్రాలు, డ్వాక్రా సంఘాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో రెవెన్యూ, వైద్యారోగ్యం, దేవదాయ, రవాణా, పట్టణాభివృద్ధి తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యమే కారణం..

**- కల్తీ పాల ఘటనపై జగన్ ఫైర్ - రాజమండ్రిలో కల్తీ పాలతో నలుగురి మృతి! - ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి - ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ**
**- ఒకే పాల వ్యాపారి నుంచి పాలు కొన్న బాధితులు**
**- పలువురి పరిస్థితి విషమం.. ఆసుపత్రిలో చికిత్స**

అమరావతి - సూర్య వాస్తవం

రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి నలుగురు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆయన, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆహార భద్రత అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని జగన్ ఆరోపించారు. ఈ దారుణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగాలని, అవసరమైతే నిపుణులైన వైద్య బృందాలను పంపాలని జగన్ కోరారు. ఆహార భద్రత తనిఖీలను కట్టుదిట్టం చేసి, పాల వంటి నిత్యావసరాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నగరంలోని లాలా చెరువు, చౌడేశ్వరి నగర్ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా నలుగురు మరణించారు. మూత్రం రాకపోవడం (అనూరియా) లక్షణాలతో వీరు మృతి చెందగా, దీనికి కల్తీ పాలే కారణమని అనుమానిస్తున్నారు. ఆదివారం రాత్రి ఎస్. శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) మరణించారు. అంతకుముందు మరో ఇద్దరు చనిపోయారు. ఈ నెల 15 నుంచి సుమారు 14 మంది అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. బాధితులంతా ఒకే పాల వ్యాపారి వద్ద పాలు కొనుగోలు చేయడంతో కల్తీ జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# బంగారం ధరల పెరుగుదలకు కారణం అదే

**- కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయన్న నిర్మలా సీతారామన్**
**- బంగారం దిగుమతులపై ఆందోళన చెందడం లేదన్న నిర్మలా సీతారామన్**
**- పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని విజ్ఞప్తి**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రపంచంలోని ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయని, పసిడి ధరల అనూహ్య పెరుగుదలకు ఇదే కారణమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశంలోకి బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో ఏమీ లేవని అన్నారు. వాటిని ఆర్బీఐ ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు. బంగారం దిగుమతులపై తాము ఆందోళన చెందడం లేదని, కరెంట్ ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉందని వెల్లడించారు. బ్యాంకులు తమ కోర్ వ్యాపారంపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. భారత్ వృద్ధి పథంలో పయనిస్తోందని, అందులో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని నిర్మలా సీతారామన్ కోరారు. అమెరికా టారిఫ్ అంశంపై కూడా ఆమె స్పందించారు. వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక సుంకాలను అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో భారత్ సహా అన్ని దేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ మార్పుల ప్రభావం భారత్‌పై ఎలా ఉంటుందని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని సమీక్షిస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ అంశంపై అప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటు అవుతుందని అన్నారు.

# ఆ మ్యాచ్ కూడా స్టేడియంకు వెళ్లి చూస్తా

**- జగన్‌కు నారా లోకేశ్ కౌంటర్ - భారత్ టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు వెళితే ఆ మ్యాచ్ తప్పక చూస్తానన్న లోకేశ్**
**- అవసరమైతే జగన్‌కు కూడా టికెట్ కొనిస్తానని సెటైర్**
**- వైసీపీ హయాంలో సాక్షి, భారతి సిమెంట్స్‌కు రూ.1000 కోట్ల లబ్ధి అని ఆరోపణ**
**- హెరిటేజ్‌కు ప్రభుత్వ లబ్ధి చేకూరలేదని స్పష్టీకరణ**
**- బడ్జెట్‌పై చర్చ కోరేవాళ్లు సభను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్న**

అమరావతి- సూర్య వాస్తవం

టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరితే, ఆ మ్యాచ్ చూసేందుకు తాను తప్పనిసరిగా వెళ్తానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అవసరమైతే పులివెందుల ఎమ్మెల్యే (జగన్)కి కూడా తన డబ్బులతో టికెట్ కొనిస్తానని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో తాను శ్రీలంకలో క్రికెట్ మ్యాచ్ వీక్షించడంపై జగన్ చేసిన విమర్శలకు లోకేశ్ తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "క్రికెట్ మ్యాచ్ చూడటానికి స్టేడియంకు వెళ్లాలా అని జగన్ అంటున్నారు. టీమిండియా ఫైనల్‌కు వెళితే కచ్చితంగా వెళ్తాను. ఆయనకూ (జగన్‌కు) ఓ టికెట్ తీసుకుంటా" అని లోకేశ్ అన్నారు. తాను గతంలో సొంత డబ్బులతోనే మ్యాచ్ చూశానని మరోసారి స్పష్టం చేశారు. ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వంపై, జగన్‌పై లోకేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌కు చెందిన సాక్షి మీడియా, భారతి సిమెంట్స్ సంస్థలకు రూ.1000 కోట్ల మేర అడ్డగోలుగా లబ్ధి చేకూర్చారని లోకేశ్ ఆరోపించారు. అయితే, తమ కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రయోజనం కలగలేదని తేల్చిచెప్పారు. హెరిటేజ్ నెయ్యిపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ.. కిలో నెయ్యి మార్కెట్‌లో రూ.1,000కి పైగా ఉంటే, రూ.360కి ఎక్కడైనా దొరికితే అది కల్తీదేనని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే హెరిటేజ్‌పై సెబీకి ఫిర్యాదు చేశారని మండిపడ్డారు. బడ్జెట్‌పై చర్చ జరగాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని లోకేశ్ విమర్శించారు. నిజంగా చర్చపై చిత్తశుద్ధి ఉంటే, నాలుగు రోజుల పాటు సభా కార్యక్రమాలను ఎందుకు అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు.

# తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం..

**- పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం**
**- ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం**
**- జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు. జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

# సంపాదకీయం



## ఎగువ సభలోనూ... కమలమే

దేశంలో 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ బలం ఏటేటా పెరుగుతోంది. అయితే రాజ్యసభలో ఇప్పటికీ బీజేపీకి సొంతంగా పూర్తిస్థాయి బలం లేదు. దీంతో మిత్రపక్షాల మద్దతుతో బిల్లులు పాస్ చేయించుకుంటోంది. అయితే ఈ ఏడాది చివరి నాటికి బీజేపీ పూర్తిస్థాయి బలం సాధించే అవకాశం ఉంది. ఇదే సమయంలో మార్చి 31 నాటికి రాజ్యసభ నుంచి మూడు ప్రాంతీయ పార్టీలు ప్రాతినిధ్యం కోల్పోనున్నాయి. మరో నాలుగైదేళ్లు మళ్లీ అడుగుపెట్టే అవకాశం కూడా లేదు.మార్చి 31 వరకు 37 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి, ఇందులో మహారాష్ట్ర (7), తమిళనాడు (6), బిహార్ (5), పశ్చిమబెంగాల్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ?ఛత్తీస్‌గఢ్?హర్యాణ (పోలు 2), హిమాచల్ ప్రదేశ్ (1) రాష్ట్రాలు కీలకం. తెలంగాణలో కాంగ్రెస్ 2, హిమాచల్‌లో 1 సీటు ఆక్రమించుకుంటుంది. మిగతావి ఎన్డీఏకు దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే వైసీపీకి రాజ్యసభలో గట్టి ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. గతంలో నలుగురు ఎంపీలు పార్టీకి రాజీనామా చేయడంతో వైసీపీ బలం భారీగా తగ్గింది. ఇప్పుడు ముగ్గురు సభ్యులు పదవీ విరమణ చేయడంతో వైసీపీ రాజ్యసభ బలం నాలుగుకు పడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఏపీ నుంచి రాజ్యసభలో ఆధిపత్యం చూపిన వైసీపీకి ఇది గణనీయమైన మార్పుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.ఇదే సమయంలో టీడీపీ?జనసేన ?బీజేపీ కూటమికు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ సీట్లు కూటమికే దక్కే అవకాశాలు దాదాపు ఖరారైనట్లు సమాచారం. అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలం కారణంగా ఈ సీట్లపై కూటమికి పూర్తి ఆధిక్యం ఉంది. దీంతో ఏపీ నుంచి రాజ్యసభలో కూటమి బలం ఏడు వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.రాజ్యసభకు కూటమి తరపున టికెట్లు ఎవరికి దక్కుతాయన్న అంశంపై ఇప్పటికే లోపల పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. టీడీపీ , జనసేన , బీజేపీల నుంచి ఆశావహులు ఎక్కువగా ఉండటంతో అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. అయితే ఎవరు పోటీ చేసినా ఎంపీలు మాత్రం కూటమి నుంచే వెళ్లడం ఖాయమని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.జాతీయ స్థాయిలో కూడా పలువురు సీనియర్ నేతలు ఈ ఏడాది రిటైర్ అవుతున్నప్పటికీ, ఏపీ రాజకీయాలపై వాటి ప్రభావం పరిమితంగానే ఉంటుందని అంటున్నారు. అయితే బీజేపీ ఎన్డీయే ) అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఎక్కువగా ఉండటంతో రాజ్యసభలో వారి బలం పెరిగే అవకాశం ఉంది. దాని ప్రభావం పరోక్షంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపైనా కనిపించే సూచనలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే, ఈ ఏడాది రాజ్యసభ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాజకీయ దిశను కొత్త మలుపు తిప్పే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వైసీపీకి బలం తగ్గడం, కూటమికి ఆధిక్యం పెరగడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణలకు దారి తీస్తుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఆర్జేడీ, యూబీటీ, ఎన్సీపీ పూర్తిగా రాజ్యసభలో లేకుండా పోతాయి. ఆర్జేడీ బిహార్ సీటు, యూబీటీ ప్రియాంక చతుర్వేది, ఎన్సీపీ అజిత్ పవార్‌వర్గ సీటు కోల్పోతాయి. ఉపేంద్రగోస్వామి పదవీ ముగింపు తర్వాత బీజేపీతో సంబంధాలు పునరుద్ధరించుకుంటున్నారు, మహారాష్ట్రలో, అధికార మహాయుతి కూటమిలో సీట్ల భాగస్వామ్యం కీలకం అవుతుంది, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మరియు సునేత్రా పవార్ నేతృత్వంలోని వర్గం మధ్య చర్చలు ఫలితాలను నిర్ణయిస్తాయని భావిస్తున్నారు. బీహార్‌లో, లోక్ జనశక్తి పార్టీ నాయకుడు చిరాగ్ పాశ్వాన్ పెరుగుతున్న ప్రభావం కూడా తుది అంకగణితంలో ఒక అంశంగా మారే అవకాశం ఉంది.ప్రతిపక్షాలకు మహారాష్ట్ర ఒక సవాలుగా ఉంటుంది, శరద్ పవార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలోని ఆయన వర్గం నుండి ఫౌజియా ఖాన్, శివసేన నుండి ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ నుండి రజనీ పాటిల్ వంటి ప్రముఖ నాయకులు తమను ఎన్నుకుంటారని ఆశిస్తున్నారు.

ఒకే ఒక అభ్యర్థికి మాత్రమే గెలిచే అవకాశం ఉంది మరియు ఖచ్చితమైన సీటు కోసం పోటీ తీవ్రంగా ఉంటుంది.ఈసారి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనని శరద్ పవార్ గతంలో చెప్పినప్పటికీ, ఇప్పుడు ఆయన పోటీ చేయాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఇండియా అలయన్స్ కు రెండో నిరాశ బీహార్ నుంచి ఎదురయ్యే అవకాశం ఉంది, అక్కడ కూడా ఒకే అభ్యర్థి గెలవగలరు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాల దారుణమైన ప్రదర్శన తర్వాత, వారు మరో రెండు స్థానాలను కోల్పోయే అవకాశం ఉంది.మూడు సీట్లు ఖాళీగా ఉన్న అస్సాం మరియు నాలుగు సీట్లకు ఎన్నికలు జరిగే ఒడిశాతో సహా అనేక ఇతర రాష్ట్రాలలో కూడా బిజెపి స్పష్టమైన ఆధిక్యాన్ని కలిగి ఉంది.హర్యానా ఛత్తీస్‌గఢ్‌లలో కూడా ఆ పార్టీ అనుకూలమైన స్థితిలో ఉంది, అక్కడ రెండు స్థానాలు చొప్పున గెలుచుకోనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో, బిజెపి కనీసం ఒక స్థానాన్ని గెలుచుకుంటుందని భావిస్తున్నారు అయితే తమిళనాడులో ప్రస్తుత బ్యాలెన్స్ మారదు.భారత కూటమికి తమిళనాడు మరియు పశ్చిమ బెంగాల్ నుండి మాత్రమే ఉపశమనం లభిస్తుంది. తమిళనాడులో, వారు గరిష్ట సంఖ్యలో సీట్లు పొందుతారని భావిస్తున్నారు.తమిళనాడులోని ఆరు సీట్లలో నాలుగు డీఎంకేకు, పశ్చిమ బెంగాల్‌లోని ఐదు సీట్లలో నాలుగు తృణమూల్ కాంగ్రెస్‌కు వెళ్తాయి. తెలంగాణలోని రెండు స్థానాలను, ఛత్తీస్‌గఢ్ మరియు హర్యానాలలో ఒక్కొక్క స్థానాన్ని, హిమాచల్ ప్రదేశ్ నుండి ఒకే ఒక స్థానాన్ని కాంగ్రెస్ నిలుపుకుంటుంది.245 మంది సభ్యులున్న ఎగువ సభలో ప్రతిపక్షానికి 79 మంది ఎంపీలు ఉన్నారు -- కాంగ్రెస్ నుండి 27 మంది, తృణమూల్ కాంగ్రెస్ నుండి 12 మంది, డిఎంకె నుండి 10 మంది, ఆర్జెడి నుండి 5 మంది, సమాజ్ వాదీ పార్టీ, సిపిఎం నుండి 4 మంది, మరియు ఇతర ప్రతిపక్ష పార్టీల నుండి ఎంపీలు ఉన్నారు. ప్రస్తుత పరిస్థితిలో, ఇండియా అలయన్స్ నుండి గరిష్టంగా 14 మంది అభ్యర్థులు గెలవగలరు.ఇది మొదటిసారి ప్రధాన విపక్షాలకు 'జీరో ఎంపీలు' స్థితిని తెచ్చిపెడుతుంది.నీరజ్ దాంగీ, అభిషేక్ సింఘ్వి, మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్ సింగ్ పదవీలు ముగుస్తున్నాయి. ఎమ్మెల్యే బలం లేకపోవడంతోమళ్లీ ఎంపిక అసాధ్యం. ఖర్గేకు మరో అవకాశం ఉండవచ్చు. కానీ దాంగీ రాజస్థాన్ లేదా హిమాచల్ అవకాశాలు మాత్రం అనిశ్చితంగా ఉన్నాయి, ఇది వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.తమిళనాడులో డీఎంకే, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ బలం కొనసాగినా, మిగతా రాష్ట్రాల్లో బీజేపీ?మిత్రాలు ఆధిక్యం సాధిస్తాయి. అసెంబ్లీ ఎన్నికలు జరగకపోతే ప్రతిపక్షాలు రాజ్యసభలో బలహీనపడతాయి, ఇది బీజేపీకి చట్టాల ఆమోదంలో స్వేచ్ఛను ఇస్తుంది.

# ఉన్నత విద్య సంక్షోభం....!

**- ఆందోళనకరంలో యువత భవిష్యత్తు**
**- డా. ముచ్చుకోట. సురేష్ బాబు, విద్య పరిరక్షణ కమిటీ**




**అనంతపురం – సూర్య వాస్తవం :** భారతదేశంలో ఉన్నత విద్యా వ్యవస్థ చారిత్రాత్మక మార్గమధ్యంలో నిలిచింది. ఒకప్పుడు దేశ నిర్మాణం సామాజిక పురోగతికి మేధో శక్తిగా భావించబడిన ఈ వ్యవస్థ ఇప్పుడు నిర్మాణాత్మకంగా, నైతికంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సంస్థల సంఖ్య వేగంగా పెరిగింది, నాణ్యత, స్వయం ప్రతిపత్తి, విద్యా లక్ష్యం పెరగలేదు. ఫలితంగా ఒక విచిత్ర పరిస్థితి ఏర్పడింది డిగ్రీలు ఎక్కువ, కానీ నైపుణ్యాలు తక్కువ; క్యాంపస్‌లు ఎక్కువ, కానీ పరిశోధన బలహీనంగా; ప్రవేశాలు ఎక్కువ, కానీ నమ్మకం తగ్గుతూ ఉంది. విద్య ఎప్పుడూ అభివృద్ధికి పునాది, ముఖ్యంగా ఆలస్యంగా పారిశ్రామీకరణ చెందుతున్న సమాజాలకు. ప్రాథమిక విద్య అక్షరాస్యతను, పౌర చైతన్యాన్ని పెంపొందిస్తే, ఉన్నత విద్య ఆవిష్కరణ, పరిశోధన, నాయకత్వాన్ని తీర్చిదిద్దుతుంది. గత అర్ధ శతాబ్దంలో తమ ఆర్థిక వ్యవస్థలను మార్చుకున్న దేశాలు మానవ వనరుల పై భారీగా పెట్టుబడులు పెట్టాయి. భారతదేశం, విశేష జనాభా ప్రయోజనం ఉన్నప్పటికీ, నిరంతరంగా అది చేయలేకపోయింది. దాని ప్రభావాలు ఇప్పుడు విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవల విద్యార్థుల సంక్షేమంపై న్యాయస్థానాల పరిశీలనలు క్యాంపస్‌లలో ఉన్న ఒత్తిడిని దేశవ్యాప్తంగా వెలుగులోకి తెచ్చాయి. ఆర్థిక ఒత్తిడి, సామాజిక ఒంటరితనం, విద్యా ఆందోళన, సంస్థాగత మద్దతు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. పరిపాలన బోధనా పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరాన్ని కోర్టులు హైలైట్ చేశాయి, ఎందుకంటే పాలనలో ఉన్న ఖాళీలు నేరుగా విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభావితం చేస్తాయి. అనేక ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అనుమతించిన బోధన పోస్టులలో సగానికి సమీపం ఖాళీగా ఉంది, దీని వల్ల బోధన నాణ్యత మరియు పరిశోధన సంస్కృతి బలహీనపడుతోంది.ఈ పతనం ముఖ్యంగా పాత ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు పేరుగాంచిన విద్యా కేంద్రాలు ఇప్పుడు తక్కువ సిబ్బందితో, నిలిచిపోయిన నియామకాలతో, తగ్గుతున్న పరిశోధనతో నడుస్తున్నాయి. ఒకప్పుడు మేధో చర్చలకు దారి చూపిన విభాగాలు ఇప్పుడు ప్రాథమిక విద్యా కార్యకలాపాలు నిర్వహించడానికి కష్టపడుతున్నారు. నియామకాలు, పాలనపై రాజకీయ విభేదాలు పరిపాలన స్తబ్ధతను పెంచగా, అవినీతి, భావజాల అనుకూలత ప్రతిభాపర మైన నియామకాలను దెబ్బతీశాయి. దీంతో స్వయం ప్రతిపత్తి సంక్షోభం విశ్వసనీయత సంక్షోభంగా మారింది.జాతీయ స్థాయిలో కూడా ఉన్నత విద్యా వ్యవస్థలో అసమతుల్యత స్పష్టంగా కనిపిస్తోంది సిద్ధత లేకుండా విస్తరణ. గత రెండు దశాబ్దాల్లో ప్రైవేట్ సంస్థలు వేగంగా పెరిగి డిమాండ్–సప్లై అంతరాన్ని పూరించాయి. కానీ అనేక సంస్థలు కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రాలుగా మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రవేశాలు పెరిగినా ప్రభుత్వ నిధులు పెరగలేదు, మౌలిక వసతులు వెనుకబడ్డాయి, అధ్యాపకుల కొరత తీవ్రమే. ప్రయోగశాలలు పాతబడిపోయాయి, గ్రంథాలయాలు సరిపడా లేవు, తరగతి గదులు కిక్కిరిసిపోయాయి. ఈ పరిమాణాత్మక పెరుగుదల ఉద్యోగ అవకాశాల్లో తీవ్రమైన అంతరాన్ని సృష్టించింది. విద్యార్థులు ప్రాయోగిక నైపుణ్యాలు, పరిశ్రమ అనుభవం, సమస్య పరిష్కార సామర్థ్యం లేకుండా పట్టభద్రులవుతున్నారు. అనేక కోర్సుల సిలబస్ దశాబ్దాలుగా మారలేదు; సిద్ధాంతానికి ప్రాధాన్యం, అన్వయానికి తక్కువ ప్రాధాన్యత. విద్యాసంస్థలు–పరిశ్రమల మధ్య బలహీన సంబంధం విద్యార్థులను వాస్తవ ప్రపంచం నుండి దూరం చేస్తుంది. ఫలితంగా చదువుకున్న యువతలో నిరుద్యోగం పెరుగుతుండగా, సంస్థలు నైపుణ్యాల కొరతను చెబుతున్నాయి ఇది వ్యవస్థ వైఫల్యానికి సంకేతం.ఈ క్షీణత ప్రధాన కారణం అధ్యాపక సంక్షోభం. అధిక పని భారం, కాంట్రాక్టు ఉద్యోగాలు, తక్కువ పరిశోధన మద్దతు, పరిపాలన ఒత్తిడి వల్ల ఉపాధ్యాయుల్లో విసుగు పెరిగింది. ఆసక్తి లేని ఉపాధ్యాయులు ఆసక్తిగల విద్యార్థులు సృష్టించలేదు. మార్గదర్శకత తగ్గడంతో హాజరు తగ్గడం, విద్యా ఫలితాలు పడిపోవడం, నమ్మకం కోల్పోవడం జరుగుతుంది. ఇది దేశ ఉత్పాదకతను దెబ్బతీసే ప్రమాదం. ప్రతిభావంతులైన అధ్యాపకులు విదేశాలకు లేదా కార్పొరేట్ రంగాలకు వెళ్లడం సంస్థల సామర్థ్యాన్ని మరింత బలహీనపరుస్తోంది.అసమానత కూడా సమస్యను పెంచుతోంది. ఉన్నత నాణ్యత విద్యకు ప్రాప్యత ప్రాంతాలవారీగా, సామాజిక వర్గాల వారీగా, ఆర్థిక స్థాయిల వారీగా సమానంగా లేదు. ప్రముఖ సంస్థలు పెద్ద నగరాల్లో కేంద్రీకృతమై ఉంది, గ్రామీణ మరియు చిన్న పట్టణాల విద్యార్థుల వలస వెళ్లాల్సి వస్తోంది లేదా తక్కువ వసతులతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. ఆర్థిక అడ్డంకులు, మద్దతు వ్యవస్థల లేమి వల్ల అట్టడుగు వర్గాల అవకాశాలు తగ్గుతున్నాయి. సమాన అవకాశాలు ఇవ్వాల్సిన ఉన్నత విద్య అసమానతను పునరుత్పత్తి చేస్తుంది. పరిశోధన రంగం కూడా బలహీనంగా ఉంది. ప్రపంచ పోటీ దేశాలతో పోలిస్తే భారతదేశం ప్రభావవంతమైన పరి శోధన ప్రచురణలు తక్కువగా ఉత్పత్తి చేస్తోంది; పదోన్నతులు తరచుగా సీనియారిటీ ఆధారంగా జరుగు తున్నాయి, సృజనాత్మకతకు తక్కువ ప్రాధాన్యం. తక్కువ నిధులు, అధిక నియంత్రణ, పరిమిత సహకారం సృజనాత్మకతను నిరుత్సాహపరుస్తుంది. బలమైన పరిశోధన సంస్కృతి లేకుండా విశ్వవిద్యాలయాలు సాంకేతిక అభివృద్ధికి లేదా విధాన రూపకల్పనకు పెద్దగా తోడ్పడవు.పాలసీ మార్పులు, గ్రేడ్ చేసిన స్వయం ప్రతిపత్తి, పరిశోధన ఫెలోషిప్‌లు, డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లు వంటి ప్రభుత్వ చర్యలు సమస్యను గుర్తించిన సంకేతాలే. అయితే స్థిరమైన పెట్టుబడి, పారదర్శక పాలన, సంస్థల స్వాతంత్ర్యం లేకుండా సంస్కరణలు అసంపూర్తిగానే ఉంటాయి. స్వయం ప్రతిపత్తి అంటే కేవలం పరిపాలనా స్వేచ్ఛ కాదు; రాజకీయ లేదా వాణిజ్య ప్రభావం లేకుండా జ్ఞానాన్ని అన్వేషించే సామర్థ్యం. పణం జాతీయ స్థాయిలో ఉంది. ఉన్నత విద్య దేశ కార్మిక శక్తి, ప్రజాస్వామ్య చైతన్యం, శాస్త్రీయ సామర్థ్యాన్ని నిర్మిస్తుంది. విశ్వ విద్యాలయాలు బలహీనపడితే ఆర్థిక వృద్ధి మందగిస్తుంది, సామాజిక పురోగతి తగ్గుతుంది, మేధో జీవితం పేదరికంలో పడుతుంది. ప్రపంచ నాయకత్వం కోరుకునే దేశం బలహీన విద్యా పునాదులపై నిలవలేను.అందువల్ల భారతదేశానికి స్పష్టమైన మార్పు అవసరం, ప్రభుత్వ పెట్టుబడులు పెంపు, ప్రతిభా పరమైన నియామకాలు, సిలబస్ ఆధునీకరణ, పరిశ్రమ భాగస్వామ్యం, ముఖ్యంగా అకాడెమిక్ స్వేచ్ఛ రక్షణ. విశ్వవిద్యాల యాలను పరిపాలనా విభాగాలుగా లేదా రాజకీయ వేదికలుగా కాకుండా జ్ఞానం, సామాజిక పురోగతికి అంకితమైన ప్రజా నమ్మక సంస్థలుగా చూడాలి. ఉన్నత విద్య సంక్షోభం కేవలం విద్య సమస్య కాదు; అభివృద్ధి సవాలు. దీనిని అత్యవసరంగా, నిష్ఠతో పరిష్కరిస్తే భారత జనాభా ప్రయోజనం జ్ఞాన ప్రయోజనంగా మారింది. నిర్లక్ష్యం చేస్తే డిగ్రీలు ఉన్న కానీ సామర్థ్యం లేని తరాలు తయారవుతాయి. ఈ ఎంపికే భారత భవిష్యత్తుకు ఉన్నత విద్య ఇంజిన్‌గా మారుతుందా, లేక అడ్డంకిగా మిగిలిపోతుందా అనేది నిర్ణయిస్తుంది.

# ఆ నాలుగు సీట్ల కోసం 40 మంది పోటీ



**విజయవాడ – సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి రాజ్యసభ వైపు మళ్లింది. వచ్చే జూన్ నెలలో ఖాళీ కాబోతున్న నాలుగు స్థానాలు అటు ఢిల్లీలోనూ, ఇటు అమరావతిలోనూ వేడి పుట్టిస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయం. అయితే, ఆ సీట్లు ఎవరికి దక్కుతాయి? అధినేతల మనసులో ఉన్న ఆ అదృష్టవంతులు ఎవరు? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నకూటమిలోని మూడు పార్టీల మధ్య ఇప్పటికే ఒక అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. మొత్తం 4 స్థానాల్లో టీడీపీ 2, జనసేన 1, బీజేపీ 1 చొప్పున పంచుకోబోతున్నాయి. వైఎస్సార్సీపీకి చెందిన అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ సీట్లు ఖాళీ అవుతుండడంతో ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కసరత్తు వేగవంతమైంది.టీడీపీకి దక్కే రెండు స్థానాల్లో ఒకటి ప్రస్తుత సభ్యుడు సానా సతీష్ కు దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఇక మిగిలిన ఒక్క సీటు కోసం అమరావతిలో భారీ ఎత్తున లాబీయింగ్ జరుగుతోంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే వర్ల రామయ్య ఈ రేసులో ముందున్నారు. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న టీడీ జనార్ధన్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వీళ్లు కాకుండా పలువురు యువకులు కూడా రాజ్యసభ సీటు ఆశిస్తున్నారు. 2024 ఎన్నికల్లో సోషల్ మీడియా బాధ్యతలు చూసి, పార్టీ గెలుపుకు దోహదపడిన చింతకాయల విజయ్ కూడా సీటు ఆశిస్తున్నారు. ఇక లోకేశ్ స్నేహితుడు కిలారి రాజేష్ పేరు కూడా వినిపిస్తోంది. మరోవైపు పార్టీ అంతర్గత వ్యవహారాల్లో కీలకంగా ఉండే సురేశ్ కోనేరు పేరు కూడా అమరావతిలో వినిపిస్తోంది. అంతేకాక భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కూడా సీటు ఆశిస్తున్నారు. ఇక జనసేన కోటాలో ఒక సీటు ఉండటంతో ఆశావహుల జాబితా చాంతడంత ఉంది. ఇటు పవన్, అటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరు దాదాపు ఖాయమైందనే ప్రచారం చాలారోజులుగా వినిపిస్తోంది. అయితే ఇప్పుడు పవన్ కల్యాణ్ ఆలోచన మారినట్లు సమాచారం. సినిమా ఇండస్ట్రీ నుంచి ఓ ప్రముఖుడిని రాజ్యసభకు పంపించే ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్టు సమాచారం. ఒకవేళ అది జరగకపోతే? పార్టీ గళాన్ని వినిపిస్తున్న వేములపాటి అజయ్ కుమార్ లేదా పార్టీ కోసం త్యాగాలు చేసిన ఇతర సీనియర్ నేతల పేర్లు కూడా పరిశీలించే అవకాశం ఉంది.ఇక బీజేపీ తన సీటును సామాజిక సమీ కరణా లకు వేదికగా మార్చుకోబో తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో అండగా నిలిచిన మందకృష్ణ మాదిగ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే అగ్రనాయకత్వం ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మందకృష్ణకు టీడీపీ, జనసేన కూడా సంపూర్ణ మద్దతు తెలిపినట్లు సమాచారం.

జూన్ లో పదవీకాలం ముగుస్తున్నప్పటికీ, ముందస్తుగానే అభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని కూటమి భావిస్తోంది. ఫిబ్రవరి ఆఖరులో లేదా మార్చి మొదటి వారంలో ఈ పేర్లపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఈ నాలుగు సీట్ల కేటాయింపు కూటమిలోని అంతర్గత సమీ కరణాలను, భవిష్యత్తు రాజకీయాలను ప్రతిబింబించబోతోంది.

## శ్రీ పెద్దమ్మ తల్లి దేవరకు పాల్గొనాలని తులసిరెడ్డికి ఆహ్వానం



**వేంపల్లె - సూర్య వాస్తవం :** ఫిబ్రవరి 28వ తేదీన, మార్చి ఒకటో తేదీన జమ్మల మడుగు పట్టణంలో శ్రీ పెద్దమ్మ తల్లి దేవర జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొ నవలసిందిగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు 2014, 2019,20204 సార్వత్రిక ఎన్నికల్లో జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పాముల బ్రహ్మానంద రెడ్డి ఆహ్వానించారు. తప్పక పాల్గొంటారని తులసిరెడ్డి చెప్పారు.

## కరిమిరెడ్డి నారాయణరెడ్డికి శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరిమిరెడ్డి అమర్నాథ్ రెడ్డి తండ్రి కీర్తిశేషులు కరిమిరెడ్డి నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సోమవారం వేంపల్లి మండలం, పాములూరు గ్రామంలో ఘనంగా జరిగింది.రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,సుబ్బారెడ్డి, అమర్నాథరెడ్డి కుటుంబ సభ్యులు బంధుమిత్రుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

## ఘనగా శివపురం పేదరాశి పెద్దమ్మకు ప్రత్యేక పూజలు




**సింగనమల - సూర్య వాస్తవం :** శింగనమల మండలం శివపురం గ్రామంలో వెలసిన శ్రీ పేదరాశి పెద్దమ్మ తల్లి విగ్రహం ఎర్పాటు చేసి ఎడాది పూర్తయిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం నిర్వహించి నట్లు అమ్మవారి పూజారి వడ్డే మహేష్ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అమ్మవారి భక్తాదులకు వారి ముక్కులు తీర్చిన ఘనత శ్రీ పేదరాశి పెద్దమ్మకు చెల్లుతుందని తెలియజేశారు. అమ్మవారి భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలియజేశారు. అనంతపురంకు చెందిన ముదిరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా వైయస్ భాస్కర్ రెడ్డి 75వ జన్మదిన వేడుకలు

**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాల యం సమీపంలో పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ వైయస్ భాస్కర్ రెడ్డి 75వ పుట్టినరోజు వేడుకలను మాజీ చైర్మన్ రసూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ లు హాజరై వైఎస్ భాస్కర్ రెడ్డి పుట్టినరోజు కేకును కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ భాస్కర్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేరంగుల చంద్రమౌళి, కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని వీరారెడ్డి, శ్రీనివాసులు యాదవ్, కనక, సంపత్, చెన్నూరుకార్తీక్, తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రావెల్ మాఫియా అరాచకం



- నిద్రపోతున్నారా అధికారులు?
- ఎన్ హెచ్ 44 ప్రక్కనగల రాందాస్ పేట గుట్టల నిలువు దోపిడీ!

**గార్లదిన్నె- సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండలం రామదాస్ పేట పరిసరాల్లో, ముఖ్యంగా ఎన్ హెచ్ (జాతీయ రహదారి 44) సమీపంలోని గుట్టలను అక్రమార్కులు యధేచ్ఛగా కొల్లగొడుతున్నారు. అధికారుల కళ్లు గప్పి కాదు.అధికారుల కళ్ల ముందే ఈ అరాచకం సాగుతోంది!గుట్టలను పిండి చేయడానికి భారీ హిటాచీలను రంగంలోకి దింపారు. ఒక జెసిబి (జేసీబీ ) తో ఎర్రమట్టిని తవ్వుతూ, హిటాచీల సహాయంతో నిరంతరం మట్టిని తరలిస్తూ ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నారు.జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్నా, మైనింగ్ మరియు రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న "మామూళ్ల" కథ ఏంటి? కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ మట్టి మాఫియా చెలరేగిపోతోంది. చట్టం అంటే భయం లేకుండా సాగుతున్న ఈ దోపిడీకి అడ్డుకట్ట వేసే నాథుడే లేడా?ప్రభుత్వ భూమిని, ప్రకృతిని దోచుకుంటున్న ఈ అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి మీకు వస్తున్న అభ్యంతరం ఏమిటి? సామాన్యుడికి ఒక న్యాయం, ఈ మట్టి మాఫియాకు ఒక న్యాయమా? రాజకీయ ఒత్తిళ్లకు లొంగి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తారా? ?"అధికారులారా... ఇప్పటికైనా కళ్లు తెరవండి! ఎన్ హెచ్ 44 సమీపంలోని గుట్టలను కాపాడండి. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. ఈ దోపిడీకి ముగింపు పలకాల్సిందేనని!"



### వాట్సాప్ ద్వారా ప్రజలకు అందించే సేవలపై

# ప్రజలలో అవగాహన పెంచాలి

- ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి పథకాలు, పనులను త్వరితగతిన, నాణ్యతతో అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం :** వాట్సాప్ ద్వారా ప్రజలకు అందించే సేవలపై ప్రజలను అవగాహన పెంచాలని, ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి పథకాలు, పనులను త్వరితగతిన, నాణ్యతతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మదనపల్లి కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వివిధ మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రజల నుండి వివిధ రకాల సేవలపై తీసుకున్న అభిప్రా యాలు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర, పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన అర్జీలు, వాట్సాప్ ద్వారా సేవలు, సమగ్ర కుటుంబ సర్వే, పీఎం కుసుం, పీఎం సూర్య ఘర్, స్వామిత్వ, వికసిత్ భారత్ జి రామ్ జి పనులు, హౌసింగ్, రీ సర్వే స్వర్ణాంధ్ర కేపిఐలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ.. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ త్వరితగతిన పూర్తిచేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో అమలు చేస్తున్న ఎం ఎస్ ఎం ఈ పార్కులు, పర్యాటక సంబంధిత ప్రధాన ప్రాజెక్టులు మరియు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్లో ఉన్న భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ ద్వారా అందే ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు చేపట్టి నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. హౌసింగ్ శాఖపై సమీక్షిస్తూ ఎన్టీఆర్ హౌసింగ్- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. వాట్సాప్ ద్వారా ప్రజలకు అందించే సేవలపై ప్రజల్లో అవగాహన పెంచా లని ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంలో మంచి పురోగతి సాధించాలని జి ఎస్ డబ్ల్యూ ఎస్ శాఖ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రజల నుంచి వివిధ అంశాలపై తీసుకున్న అభిప్రాయాలను సమీక్షించుకొని ప్రజలకు అందించే సేవల నాణ్యతను పెంచాలని ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ మరియు పిఎం కుసుం కార్యక్రమంలో పురోగతి సాధించాలని విద్యుత్ శాఖ మరియు ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే ఫేస్ -2, ఫేస్ -3 పనులలో జాయింట్ ఎల్ పి ఎం సమస్యలు తలెత్తకుండా నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. స్వామిత్వ పనులలో పురోగతి సాధించాలని ఆదేశించారు. వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్య క్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదే శించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలే ప్రథమ ప్రాధాన్యం

- బాధితులకు అండగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- నేరుగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి
- వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల ఫిర్యాదులపై సత్వర చర్యలకు ఆదేశం
- జవాబుదారీతనంతో పనిచేసి ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి
- పోలీసు అధికారులకు ఎస్పీ పిలుపు



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం**

ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయడమే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యమని, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. సోమవారం మదనపల్లి డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల నుండి ఎస్పీ స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి బాధితుడితోనూ ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. బాధితులు తెలిపిన అంశాలలోని వాస్తవికతను పరిగణనలోకి తీసుకుని, ఆయా ఫిర్యాదులను తక్షణమే సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. నిర్దేశిత సమయంలోగా సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగించాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్పీ ముఖ్య ఆదేశాలు**

వికలాంగులు, వృద్ధులు, మహిళలు ఇచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి మొదటి ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన విచారణ జరపాలి. సమస్యల పరిష్కారంలో ప్రతి అధికారి బాధ్యతగా, జవాబుదా రీతనంతో వ్యవహరించాలి. మనం అందించే న్యాయం బాధితుల ముఖాల్లో చిరునవ్వు నింపాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రానికి రాలేని వారు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ లేదా సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని, వాటిని కూడా 'మీకోసం' ఫిర్యాదులుగానే పరిగణించి సత్వర న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ వేదికను సద్వినియోగం చేసు కోవాలని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రత, న్యాయం కోసం కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ పునరుద్ఘాటించారు.

# విద్యార్థి విజయానికి 7 విజయ సోపానాలు

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి






**వేంపల్లె - సూర్య వాస్తవం :** పండంటి కాపురానికి 12 సూత్రాలు ఉన్నట్లే విద్యార్థి విజయానికి ఏడు విజయ సోపానాలు ఉన్నాయని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. కడప జిల్లా వేంపల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి శ్లోక పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసము, అవిశ్రాంత కృషి,ఏకాగ్రత, పవిత్రమైన భావన, ఉత్సాహం,సమయపాలన, చొరవ అనబడే ఏడు సూత్రాలను పాటిస్తే అటు 10వ తరగతి పరీక్షల్లో



గాని,జీవితంలో గాని ఖచ్చితంగా విజయం సాధించవచ్చు అని తులసి రెడ్డి విద్యార్థులకు ఉద్బోధించారు. విద్యుత్ తో పాటు సంస్కారం కూడా అవసరమని ఆయన అన్నారు. శ్లోక పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని తులసి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కన్న తల్లిదండ్రులను, చదువు నేర్పించిన ఉపాధ్యాయులను పాఠశాలను ఎన్నటికీ మరిచిపోవద్దని వేంపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి నాగభూషణం రెడ్డి అన్నారు. మోటివేషనల్ స్పీకర్ హర్షకిరణ్ తన ప్రసంగంతో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కల్పించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు బీగాల రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామ వినయ్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మెడల్స్ ఇవ్వడం జరిగింది.

# పరిశ్రమల అభివృద్ధికి కీలకం...

- స్వర్ణముఖిపై హై లెవెల్ బ్రిడ్జి అవసరం
- శాసనసభలో అంశాన్ని ప్రస్తావించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ
- వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం, ప్రజలకు ఇబ్బందులు




**నాయుడుపేట - సూర్య వాస్తవం :** నాయుడుపేట పట్టణ సమీపంలోని స్వర్ణముఖి నది పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం నాయుడుపేట--వెంకటగిరి పట్టణాలను అనుసంధానం చేస్తూ గతంలో నిర్మించిన లో లెవెల్ బ్రిడ్జి వరదల సమయంలో నీటిమునిగిపోతూ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆమె పేర్కొన్నారు. మేనకూరు ప్రత్యేక ఆర్థిక మండలిలో (సెజ్) కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో రోజూ సుమారు 300కి పైగా భారీ వాహనాలు, కార్మికులను తరలించే బస్సులు, ఇతర వాహనాలు ఈ లో లెవెల్ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్నాయని తెలిపారు. భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు వాహన రాకపోకలు నిలిచిపోవడంతో పరిశ్రమల కార్యకలా పాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని సభలో వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమల ప్రోత్సాహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అనేక సంస్థలు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యంత అవసరమని అన్నారు. పరిశ్రమలకు వెళ్లే వాహనాలకు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వర్ణముఖి నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రాధా న్యతగా చేపట్టాలని కోరారు. ఆర్ అండ్ బి శాఖ మంత్రి స్పందించి వీలైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణానికి అవసర మైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

## - సిఐటియు ఆధ్వర్యంలో నిరసన దీక్షలు



**వెంకటగిరి - సూర్య వాస్తవం :** సోమవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఐసిడిఎస్ వెంకటగిరి ప్రాజెక్ట్ బంగారుపేట వద్ద అంగన్వాడీలు వేతనాలు పెంచాలని లేబర్ కోట్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్షలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వెంకటగిరి ప్రాజెక్ట్ కార్యదర్శి ఎన్ స్వరూప రాణి మాట్లాడుతూ, అంగన్వాడీలకు నెలకు 26000 కనీస వేతనం ఇవ్వాలని 10000 పెన్షన్ చెల్లించాలని లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్స్ సాధన కోసం అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల ముందు రిలే దీక్షలు చేపట్టడం జరిగిందని అన్నారు. అందులో భాగంగానే వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు ముందు దీక్షలు చేపట్టడం జరిగిందని అన్నారు. 2014 సంవత్సరం నుండి ఇప్పటివరకు అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదని అన్నారు. ఇప్పటికైనా పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2017 సంవత్సరము నుండి లబ్ధిదారులకు ఆహార నిధులు పెంచలేదని అన్నారు. వెంటనే పెంచాలని అన్నారు , పోషణ ట్రాకర్ ఈ కేవైసీ, ఎఫ్ ఆర్ ఎస్ తదితర పేర్లతో అంగన్వాడీలపై వేధింపులు పెరిగాయని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని చెప్పినా,అంగన్వాడీలకు ఇవ్వడం లేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేయడం జరిగిందని అన్నారు. ఫలితంగా జీవో మాత్రమే ఇచ్చారని మార్గదర్శకాలు ఇవ్వలేదని అన్నారు. ఇన్ని అన్యాయాలు అంగన్వాడీలు ఎదుర్కొంటూ పిల్లల భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని, అంగన్వాడీలు పనిచేస్తున్నారని అన్నారు. అంగన్వాడీల భవిష్యత్తు ఎవరు చూడాలని ప్రశ్నించారు. దేశ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్నటువంటి అంగన్వాడీల భవిష్యత్తు గురించి చూడాల్సిన బాధ్యత పట్టించుకోవాల్సిన అవసరం ఈ ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటినీ వెంటనే పరిష్కారం చేయాలని అన్నారు. కార్మికులకు నష్టం చేసేటటువంటి లేబర్ కోట్స్ ని వెంటనే రద్దు చేయాలని అన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే సమ్మె చేసే హక్కు ఉండదని, సంఘం పెట్టుకునే హక్కు ప్రమాదంలో పడుతుందని అన్నారు. దేశమంతా ఒకే వేతనం ఉండాలంటూ కేంద్ర గవర్నమెంట్ ఒక రోజుకి 178 రూపాయలు వేతనం ఉంటే సరిపోతుందని నిర్ణయించిందని అన్నారు. అంటే నెలకు 5140 వేతనం ఉంటే సరిపోతుందని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందని అన్నారు. ఇది జీవన వేతనమా అవమాన వేతనమా అని అన్నారు. కార్మిక, ఉద్యోగ,కర్షక వ్యతిరేక విధానాలు ప్రైవేటీకరణ విధానాలు అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తగిన సమయంలో గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. అంగన్వాడి వర్కర్లను, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. ఐసిడిఎస్ కి నిధులు కేటాయింపులు పెంచాలని ఐసిడిఎస్ ని కాపాడాలని అన్నారు. అంగన్వాడీలకు పిఎఫ్ ఈఎస్ఐ వర్తింపచేయాలని అన్నారు. ప్రభుత్వాలు స్పందించి అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నిటిని పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాల్ని ఉదృతం చేస్తామని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షులు- పి లక్ష్మీ ప్రసన్న నాయకులు, వరలక్ష్మి, రమ, నిర్మల, ప్రభావతి, సుభాషిని, ఉష, రమణమ్మ, అన్నపూర్ణ, మమ్ముల బేగం, తులసి, సుగుణ, రాజేశ్వరి, సుకన్య, విజయ,పాలమ్మ, సుమతి,నవమణి, జయంతి, పి లీలావతి తదితరులు పాల్గొన్నారు.


# మంత్రి మండిపల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీఎస్ఆర్టీసీ ఎండి

- స్త్రీ శక్తి పథకం అమలుపై మంత్రి, ఆర్టీసీ ఎండీ చర్చ
- ఆర్టీసీ భవిష్యత్ కార్యాచరణలపై కీలక సమావేశం



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం :** రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎండీ .బాలసుబ్రమణ్యం అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బలోపేతం, స్త్రీ శక్తి పథకం అమలు తీరుపై, అలాగే ఆర్టీసీలో తదుపరి కార్యాచరణలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు.

# ఎంపీ అవినాష్ రెడ్డికికి మఠాధిపతి పట్టాభిషేక ఆహ్వానం




**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఈనెల 26న జరిగే పట్టాభిషేక మహోత్సవానికి రావాలని ఎంపీ అవినాష్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసిన మఠాధిపతి తమ్ముడు శ్రీ దత్తాత్రేయ స్వామి ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి మఠానికి చెందిన ఇటుకల రవికుమార్ గౌడ్ కూడా ఉన్నారు.

# నేటి నుంచి మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామి పట్టాభిషేకం

- వేలాదిమంది భక్త జన సందోహం మధ్య మూడు రోజులు కార్యక్రమాలు






**బ్రహ్మంగారి మఠం - సూర్య వాస్తవం :** రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానం కాలజ్ఞాన సృష్టి కర్త, భూత భవిష్యత్ వర్తమాన కాలాలను సమాజానికి చాటిచెప్పిన గొప్ప మహానుభావుడు, సజీవ సామాది నిష్ఠ వహించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానం కు 8 వ తరం 12వ మఠాధిపతులుగా శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు ఈ నెల 26వ తేదీ పట్టాభి శేఖం తీసుకోబోతున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వేంకటేశ్వర స్వాముల వారు శివైక్యం పొందిన తరువాత 12 వ మఠాధిపతులుగా ఆయన పెద్దకుమారుడు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు అంగరంగ వైభవంగా పట్టాభిషేకం తీసుకుంటున్నారు. ఈ పట్టాభిషేకం మహోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుండి 26 వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు భక్త జన సందోహం మధ్య జరుగుతాయని ఆయన అన్నారు. ముఖ్యముగా 26 వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు సింహాసనంపై ఆసీనులై వేదపండితుల ద్వారా మేల తాళాల మధ్య అంగ రంగ వైభవంగా పట్టాభిషేకం స్వీకరించనున్నట్లు మేనేజర్ తెలిపారు.కాబట్టి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి శిష్యబృందం,భక్తులు మఠాధిపతుల వారి శిష్యులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

# అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం

- శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం
- రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం
- వేంపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి



**లింగాల – సూర్య వాస్తవం :** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని వేంపల్లి టిడిపి ఇన్చార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం లింగాల మండలం చిన్నకుడాల గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ మరియు నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ఇతర కూటమి నాయకులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మరియు ఇతర నేతలు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర దక్కాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. రైతులు ఎవరూ తక్కువ ధరకు దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో, రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు నాణ్యమైన సేకరణ ప్రక్రియను చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి,మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, విత్తనం నుండి విక్రయం వరకు ప్రతి దశలోనూ అన్నదాతకు అండగా ఉంటామని నాయకులు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.వారితో పాటు మార్క్‌ఫెడ్,నాఫెడ్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.



## ఆఖిల భారత రెడ్డి సంఘంలో పలువురు నియామకాలు

- అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు ఏ.సి. వెంకటరమణారెడ్డి
- జమ్మలమడుగు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులుగా సిరమ్మగారి గోపాల్ రెడ్డి
- తొండూరు మండలరైతు విభాగం అధ్యక్షులుగా కంబం వెంకటకృష్ణారెడ్డి
- జమ్మలమడుగు మహిళా విభాగం అధ్యక్షురాలుగా కర్నాటి లక్ష్మీదేవి
- రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి
- రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి



**కడప –సూర్య వాస్తవం :** అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురిని నియమించినట్లు అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి లు తెలిపారు.సోమవారం వారు మాట్లాడుతూ అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురిని నియమించి వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా ఏ.సి. వెంకటరమణారెడ్డి,జమ్మలమడుగు నియోజక వర్గం రైతు విభాగం అధ్యక్షులుగా సీరమ్మ గారి గోపాల్ రెడ్డి , తొండూరు మండలం రైతు విభాగం అధ్యక్షులుగా కంబం వెంకట కృష్ణారెడ్డి , జమ్మలమడుగు మహిళా విభాగం అధ్యక్షురాలుగా కర్నాటి లక్ష్మీదేవి లను నియమించినట్లు జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి లు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ వివిధ పదవులు పొందిన వారికి అఖిల భారత రెడ్డి సంఘం తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తమ నాయకత్వంలోరాష్టంలో రెడ్డి యువత, మహిళాలు ఐక్యంగా ముందుకు సాగి, సమాజాభివృద్ధి దిశగా మరింత కృషి చేస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నామని తెలిపారు.

**రెడ్డి సమాజం ఐక్యమే మన బలం**

మన సేవా ప్రయాణం విజయవంతం కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నానని తెలిపారు.పదవులు పొందిన వారు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామభూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి, రాష్ట్ర రైతులువిభాగం ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లాల, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ- అనుబంధ రంగాలకు 10శాతం నిధులు కేటాయించాలి

- రైతు సంఘం, సిపిఐ డిమాండ్



**వెంకటగిరి –సూర్య వాస్తవం :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 14న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు కనీసం 10% నిధులు కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లిపాటి బాలకృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వెంకటగిరి తాహిసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో రైతాంగానికి అరకొర నిధులు కేటాయించి రైతాంగం సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రెండు దెందో దెందు అన్నా తీరుతో వ్యవహరిస్తున్నాయని రైతాంగ సమస్య పరిష్కారంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. కౌలు రైతులకు రావాల్సిన సుమారు రూ. 3500 కోట్లు బకాయిలు ను వెంటనే వారి ఖాతా లో జమ చేయాలని డిమాండ్ చేశారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. అమెరికాతో చేసుకున్న రైతాంగ ఒప్పందాలను రైతులకు భారత ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేసేటివని అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను దేశ ప్రజలకు వివరించమంటే వారిని దేశద్రోహులుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి దాడి చేయడం వారిచికటి ఒప్పందాలకు నిదర్శనం అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలేక, అధిక పెట్టుబడులు, నష్టాలతో రైతులు అన్నమో రామచంద్ర అంటూ అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపా ధ్యక్షులు పల్లిపాడు బాలకృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయానికి 10% నిధులు కేటాయించాలిని, ప్రస్తుత సంవత్సర బకాయిల కింద సుమారు 27,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలి. ఎన్నికల వాగ్దానం మేరకు నూతన కౌలు చట్టం తీసుకురావాలని ధరల స్థిరీకరణకు 3000 కోట్లు వడ్డీ రాయితీకి 2000 కోట్లు బకాయాలను వెంటనే వారి ఖాతాలో జమ చేయాలన్నారు మైనర్ ఇరిగేషన్ పనులకు కనీసం 5000 కోట్లు కేటాయించాలి రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు నిధులు కేటాయిం చాలన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు తక్షణమే ఎక్స్ గ్రేషియా చెల్లించి వారిని ఆదుకోవాలని, కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచేలా రాష్ట్రానికి వెన్నుముకైనా రైతాంగం ఆర్థికంగా కుంగి పోకుండా ఉండాలంటే ప్రభుత్వం ఈ అంశాలను పునః పరిశీలించి బడ్జెట్లో మార్పులు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. అనంతరం మండల తహాశీల్దార్ నరసింహారావు కు సమస్యలు తో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.తహాశీల్దార్ స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రూరల్ కార్యదర్శి ఎస్ వి నరసింహులు, పట్టణ కార్యదర్శి డక్కిలి శివకుమార్, మునికృష్ణా రెడ్డి, ఎ ఐ వై ఎఫ్ నియోజక వర్గ కార్యదర్శి సాయి, ప్రసాద్, వరుణ్ రైతులు గురవయ్య, శ్రీనివాసులు, మురళి , సాయి తదితరులు పాల్గొన్నారు.



## వంగ సాగు రైతు బెంగ రోజురోజుకూ దిగజారుతున్న ధరలు



**వేముల – సూర్య వాస్తవం :** వంగ సాగు చేసిన రైతులు బెంగ పడుతున్నారు. ఇటీవల వరకు పది కిలోలు రూ.300 వరకు ఉన్న వంకాయల ధర ప్రస్తుతం రూ.60కు పడిపోయింది. కిలో రూ.30 చొప్పున ధర ఉంటేనే సాగుచేసిన రైతులకు పెట్టుబ డులు వచ్చేది. కనీసం పది కిలోలు రూ.200 ఉండక పోతుందా అని రైతులు భావించారు. తీరా ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. ఈఏడాది వంగ దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధరలు దిగజారాయి. దిగుబడులు వస్తున్నాయనుకున్న సమయంలో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కోత కూలి, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. వంగ సాగును విస్తారంగా చేపట్టారు. ఈ ప్రాంతాల నుంచి వంకాయలు నెల్లూరుకు కూడా ఎగుమతి చేస్తుంటారు. దీంతో రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో పొలంలో వదిలివేయడమే మేలన్న భావనతో కొందరు కోతలు కూడా కోయడం లేదు. మరికొందరు గ్రామాల్లో తిరిగి సొంతంగా అమ్మకాలు చేసుకుంటున్నారు. దీన్నిబట్టి చూస్తే ఈఏడాది వంగ సాగు చేసిన వారు నిండా మునిగినట్టేనన్న విషయం అర్థమవుతోంది.

## జిల్లా బధిర సంఘం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



**కడప –సూర్య వాస్తవం :** కడప జిల్లా బధిర సంఘం 2026--2029 సంవత్సరాల సాధారణ సంఘ ఎన్నికలు ఆదివారం డి.ఎస్.ఏ. ఇండోర్ స్టేడియం, శంకరాపురంలో నిర్వహించిన ప్రత్యేక సాధారణ సమావేశంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా టి.నరసింహ మూర్తి వ్యవహరించగా, ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్. వెంకట బాలరెడ్డి బాధ్యతలు నిర్వహించారు. సంఘానికి చెందిన 250 మంది సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో మూడు సంవత్సరాల కాలానికి (2026--2029) క్రింది సభ్యులు ఎన్నికయ్యారు. జె. లక్ష్మీ కిషోర్ (ప్రొద్దుటూరు) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జి. సాయి సందీప్ కుమార్ (కడప) ఉపాధ్యక్షుడు–1గా ఎన్నికయ్యారు. సి. కిరణ్ రెడ్డి (రాయచోటి) ఉపాధ్యక్షుడు–2గా ఎన్నికయ్యారు. ఎ.రమాదేవి (కడప) ఉపాధ్యక్షుడు–3గా ఎన్నికయ్యారు. ఎ. ఇర్ఫాన్ (కడప) ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక య్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులు తమ పదవీకాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న బధిరుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు విద్యా, ఉపాధి అవకాశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. వీరికి వేంపల్లి భవిత దివ్యాంగుల వనరుల కేంద్రం ఐఈఆర్టి యశోద, ప్రొద్దుటూరు మదర్ తెరిసా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షులు షాకీర్ హుస్సేన్ లు అభినందనలు తెలిపారు.

## నందిపల్లె నందీశ్వర ఆలయ ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవాల్లో పాల్గొన్న కడప ఎంపీ



**వేంపల్లె –సూర్య వాస్తవం :** వేంపల్లె మండలంలోని నందిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ నందీశ్వర ఆలయ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఆలయ శిఖర కళాశాల్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి,ఆలయ ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మంగళ వాయిద్యాలతో ఆలయానికి తీసుకెళ్లారు.అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పూజల్లో భాగంగా మొదటి రోజు కలశ స్థాపన,గో పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ 25వ తేది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నందీశ్వరాలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.అలాగే ఆలయ ప్రతిష్టా మహోత్సవ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్నదాన కార్యక్రమం,పార్కింగ్, కుంభాభిషేక,ఆలయ పరిసరాలలో పలు ఏర్పాట్లపై ఆలయ ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డికి పలు సూచనలు చేశారు.వేంపల్లె మండల ప్రజలు నందీశ్వరుడి ప్రతిష్టా కార్యక్రమాల్లో పాల్గొని కృపకు పాత్రులు కాగలరని కోరారు.వేంపల్లె సీఐ నరసింహులు తన సిబ్బందితో పోలీసుల బందోబస్తు ఏర్పాటుపై పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల రెడ్డి,నందిపల్లె సర్పంచ్ సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పులివెందుల అభివృద్ధిలో కూటమి సర్కార్ వైఫల్యం

**- పులివెందుల అభివృద్ధికి 'వైఎస్' కుటుంబమే భరోసా**
**- పాడా నిధులు నిలిపివేసినా రూ.50లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ**





**పులివెందుల - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా పులివెందుల అభివృద్ధిని గాలికి వదిలేసిందని వైఎస్సార్సీపీ నేతలు మండిపడ్డారు. ముఖ్యంగా పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ పాడా నిధులను నిలిపివేసి, అభివృద్ధిని అటకెక్కించిన తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చెరిపివేస్తూ ప్రభుత్వం మారగానే పాడాను నిర్వీర్యం చేసి గతంలో మంజూరైన పనులను నిలిపివేసినా, పులివెందుల ప్రజల కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నడుం బిగించారన్నారు. ప్రభుత్వ సహకారం లేకపోయినా తమ ఎంపీ నిధుల నుండి దాదాపు రూ.2 కోట్ల రూపాయలను మున్సిపాలిటీకి మంజూరు చేయించి అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తున్నారు. ఇందులో భాగంగానే భాకరాపురం సచివాలయం నుండి త్రిలోక్ మార్ట్ వరకు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి,మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధిని అడ్డు కోవాలని చూసినా వైఎస్ కుటుంబం పులివెందుల గడ్డను విస్మరించదు అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ హాఫీజ్,పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్,కౌన్సిలర్ కోడి రమణ, రాజశేఖర్ రెడ్డి,గండి రాము పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

**- అధ్యక్షులు చాగలేటి భాస్కర్**



**పులివెందుల - సూర్య వాస్తవం :** మార్చి నెల నాటికి పెండింగ్ లో ఉన్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ, మూడు చక్రాల మోటార్ వాహనాలు, దివ్యాంగులకు ఏపీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు పాస్ మంజూరు చేయాలని వైఎస్ఆర్ సీపీ పులివెందుల నియోజకవర్గం దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చాగలేటి భాస్కర్ కోరారు. సోమవారం పులివెందుల ఆర్డీవో చిన్నయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా చాగలేటి భాస్కర్ మాట్లాడుతూ...జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాలలో దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాల వెరఫికేషన్ను క్షుణ్ణంగా పరిశీలించి మార్చి నెలలో నోటిఫికేషన్ ఇవ్వగలరని విజ్ఞప్తి చేస్తూ, త్వరగా భర్తీ చేయగలరని ఆకాంక్షిస్తున్నానన్నారు. శారీరక దివ్యాంగుల సమాజం ఎక్కువగా ఉన్నందున వారి వయస్సును దృష్టిలో ఉంచుకొని న్యాయం చేయగలరని ఆలాగే ఉద్యోగుల భర్తీలో అర్హత గల అభ్యర్థి లేనియెడల ఈ సంవత్సరం నోటిఫికేషన్ లోనే తదుపరి కేటగిరి గల అభ్యర్థులచే భర్తీ చేసే వెసులుబాటు కల్పించాలన్నారు. జిల్లాలోని మూడు చక్రాల వాహనాల ఉచిత మంజూరు విషయంలో అర్హత కలిగిన దివ్యాంగుల అందరికీ నియాజక వర్గానికి 25 స్కూటీల చొప్పున 4375 మంది లబ్ధిదారులుగా గుర్తించి జిల్లా కేంద్రంలో ఉచితంగా లైసెన్స్ మేళాను నిర్వహించి ఆర్టీఈపో టూ వీలర్ చలానా 260 రూపాయలు మరియు డ్రైవింగ్ లైసెన్స్ చలానా 770 రూపాయలు వెలసి మొత్తం రుసుము 1030 రూపాయలు ప్రభుత్వమే చెల్లించే విధముగా వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేసున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంద్రధనస్సు 7 వరాలు ప్రకటించినారు అందులో ఉచిత బస్సు ప్రయాణం వెంటనే అమలు చేయవలసిందిగా కోరుచున్నాము. పై విన్నపాలను కలెక్టర్ దయతో చొరవ చూపి త్వరితగతినే దివ్యాంగులకు న్యాయం చేకూర్చగలరని కోరుతున్నాం. లేనిపక్షంలో వైయస్ఆర్సీపి రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి తీసుకువెళ్లి దివ్యాంగులకు న్యాయం చేసేలా పార్టీ ఆదేశాల మేరకు ప్రజా ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్. ప్రసాద్ పుల్లయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# దీనబంధు మానసిక వికలాంగులకు
# అన్నదానం, పండ్లు పంపిణీ




**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని పార్లపల్లి రోడ్డు సమీపంలో ఉన్న దీనబంధు మానసిక వికలాంగులకు పులివెందుల నియోజకవర్గ వైకాపా ఇన్చార్జ్ వైయస్ భాస్కర్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని జిల్లా వైకాపా చేనేత ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పండ్లు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింహాద్రిపురం మండల వైకాపా అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, దేరంగులచంద్రమౌళి, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని ఇరికిరెడ్డి వీరారెడ్డి లు హాజరై ఈశ్వర ఏర్పాటు చేసిన కేకుమానిశిక వికలాంగులతో కలసి కట్ చేసి వారికి పంపిణీ చేశారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేసి మాంసాహారంతో కూడిన అన్నాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ భాస్కర్ రెడ్డి నిండు నూరేళ్లుఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు.

ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైఎస్ భాస్కర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏదో ఒక సేవా కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు అందులో భాగంగా ఈరోజు మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం మాంసంతో కూడిన ఆహారాన్ని అందించడం జరిగిందన్నారు. ఇలా చేయడం వల్ల నా మనసుకు చాలా ఆనందాన్ని కలిగిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్, భాష తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభోవంగా లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం







**గుత్తి -సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో గుత్తి కోటలో ని కొలవై ఉన్న శ్రీశ్రీశ్రీ భూనిలా సమేత నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి దే వాలయ అభివృద్ధి కమిటీ వారి ఆహ్వానం మేరకు రాష్ట్ర కా ర్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మ న్ వెంకట శివుడు యాదవ్ హాజరై స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రజలంద రూ ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరు కోవడం జరిగింది. ఈ కార్య క్ర మానికి గుత్తి పట్టణం గ్రామాల ప్రజలు గుత్తి కోటలోని వెలిసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో,వేదమంత్రోచ్చర ణల మధ్య ఘనంగా నిర్వ హించారు.ఈ వేడుకను తిల కించడానికి భక్తులు భారీ సం ఖ్యలో తరలివచ్చారు.కల్యా ణోత్సవం అనంతరం భక్తు లందరికీ తీర్థ ప్రసాదాలు పం పిణీ చేయడంతో పాటు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

## రాజమండ్రి కల్తీ పాల ఘటన రాష్ట్రాన్ని కలచి వేసింది

**- పీసీసీ రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా**



**రాయచోటి- సూర్య వాస్తవం:** రాజమండ్రిలో జరిగిన కల్తీ పాల ఘటన రాష్ట్రాన్ని కలచివేసిందని, విషపూరిత పాలు సేవించి నలుగురు మృతి చెందడం అత్యంత విషాదకరమని,కిడ్నీ సమస్యలతో మరికొందరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారనే వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని పిసిసి రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా కాంగ్రెస్ పార్టీ తరపున మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సోమవారం అయినా సూర్య వాస్తవం విలేకరితో మాట్లాడుతూ ఈ ఘటన ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆహార భద్రత విషయంలో పర్యవేక్షణ ఎందుకు విఫలమైందో, కల్తీ పాలు మార్కెట్లోకి ఎలా వచ్చాయో సంబంధిత అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఆసుపత్రుల్లో ఉన్న బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించి మృతుల కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం ప్రకటించాలని అన్నారు. అలాగే కల్తీ పాల సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీని నియమించి నిజాలు బయటపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.మరిన్ని ప్రాణనష్టాలు జరగకుండా వెంటనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలి ఆయన కోరారు. ప్రజల ప్రాణాలతో ఆటలాడే కల్తీ మాఫియాపై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటన పునరావృతం కాకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ దాడి

**- రూరల్ సీఐ వెంకటరమణ, సింహాద్రిపురం ఎస్ఐ అనిల్ కుమార్ లను విచారిస్తున్న ఏసీబీ అధికారులు**

**సింహాద్రిపురం -సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గ పరిధిలోని సింహాద్రిపురం పోలీస్ స్టేషన్ నందు సోమవారం ఏసీబీ అధికారుల దాడి సంచలనం కాగా, రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్సై అనిల్ కుమార్ల పాత్రపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఇటీవల సింహాద్రిపురం గ్రామ పరిధిలో చోటు చేసుకున్న చైన్ స్నాచింగ్ దొంగతనంలో ఒక ద్విచక్ర వాహనదారున్ని పోలీసులు గుర్తించగా విచారణలో ద్విచక్ర వాహనం అమ్మిన వ్యక్తి వద్ద నుంచి నాలుగు లక్షలు డబ్బులు ఇవ్వాలని పోలీసులు డిమాండ్ చేసినట్లు వాటిలో భాగంగానే గత శనివారం లక్ష లంచం రూపంలో అందజేసిన కదిరికి చెందిన ఏజెంట్ బ్రహ్మాం అందజేసినట్లు మిగిలిన డబ్బుకోసం వత్తిడి తేవడంతో బాధితుడు బ్రహ్మాం ఏసీబీని ఆశ్రయించి నేడు లక్షన్నర లంచం తీసుకుంటూ పోలీసులు ఏసీబీకి పట్టుబడగా, లంచం సొమ్మును ఏసీబీ అధికారులు సీజ్ చేసి మూడు గంటలపాటు సీఐ, ఎస్సైల ఏసీబీ అధికారులు విచారణ కొనసాగగా డీఎస్పీ, రూరల్ సీఐ ఆదేశాలతోనే బాధితుడు బ్రహ్మాం ను డబ్బులు డిమాండ్ చేసినట్లు ఎస్సై అనిల్ కుమార్ ఏసీబీకి స్టేట్మెంట్ ఇచ్చినట్లు సమాచారం రాగా, కాశ్మీర్ లో చోరీ అయిన టువీలర్ను ఏపీలో నెంబర్ ప్లేటు మార్చి అక్రమార్కులు విక్రయించారని, నెంబర్ ప్లేట్ మార్చిన టు వీలర్లో చైన్ స్నాచింగ్లకు పాల్పడుతూ సుమారు 15 లక్షలు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించగా, ఈ వ్యవహారంలోనే టు వీలర్ అమ్మిన ఏజెంట్ బ్రహ్మాంను పోలీసులు డిమాండ్ చేసినట్లు పోలీసుల ఒత్తిడిని భరించలేక ఏజెంట్ బ్రహ్మాం ఏసీబీ ని ఆశ్రయించి ఏసీబీకి సమాచారం అందించగా రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు తమ విధులు నిర్వహించారు. ఏది ఏమైనప్పటికీ పోలీస్ శాఖలో అవినీతిపై ఏసీబీ చర్యల పట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం ఉలిక్కిపడగా జిల్లా వ్యాప్తంగా ఇటీవల ప్రిన్స్ నందు, పులివెందుల ఆర్డీవో కార్యాలయం నందు అవినీతి బాగోతాలు బయటపడటం పట్ల అధికారులు, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.





# 27న 'డెకాయిట్'.. 'రూబారూ'

అడివి శేష్ లేటెస్ట్ మూవీ 'డెకాయిట్'. షానిల్ డియో దర్శకత్వంలో, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా తెరకెక్కుతున్న ఈ థ్రిల్లర్ చిత్రం నుంచి తాజాగా ఒక అప్‌డేట్ వచ్చింది.

ఈ సినిమా మ్యూజిక్ జర్నీని ప్రారంభిస్తూ.. ఫిబ్రవరి 27న 'రూబారూ' అనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'అతను ఆమెను ప్రాణంగా ప్రేమించాడు.. కానీ ఆమె అతనికి ఊహించని ద్రోహం చేసింది. తను ఒక దోపిడీదారుడిగా మారడానికి ముందు అతని జీవితంలో జరిగిన ఆ విలయం ఏంటి? అతను అనుభవించిన ఆవేదన ఏంటి?' అనేది ఈ పాట ద్వారా అర్థమవుతుందని అడవి శేష్ ఓ క్యాప్షన్ ద్వారా ఈ పాట అనౌన్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్ కూడా విడుదల చేశారు.

ప్రకాష్ రాజ్, అనురాగ్ కశ్యప్, సునీల్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలోకి రానుంది. శరణ్ రాజ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

# నాని 'ది ప్యారడైజ్' టైటిల్ సాంగ్ ప్రోమో




నాని కొత్త సినిమా 'ది ప్యారడైజ్' నుంచి టైటిల్ సాంగ్ ప్రోమో వచ్చేసింది. ఆయా షేర్.. అంటూ వందలాదిమంది డ్యాన్సర్లతో నాని వేసిన స్టెప్పులకు అదిరిపోయేలా అనిరుధ్ రవిచందర్ సంగీతం ఉంది.

కాసర్ల శ్యామ్ కుమార్ రచించిన ఈ పాటను అడ్డుల జంగిరెడ్డి, ఆకునూరి దేవయ్య, అనిరుధ్ రవిచందర్ ఆలపించారు.

మంగళవారం నాడు పూర్తి సాంగ్‌ను విడుదల చేస్తామని ప్రోమోలో ప్రకటించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మోహన్‌బాబు, సంపూర్ణేష్‌బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి నటిస్తున్నారు.

ఆగస్టు 21న ఈ మూవీ విడుదల కానుంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రంలో నాని ఒక ప్రత్యేకమైన గెటప్‌లో కనిపించనున్నారు.

# డెబ్యూ డైరెక్టర్‌తో వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దగ్గర పనిచేసిన బాలాజీ అనే డెబ్యూ డైరెక్టర్ చెప్పిన కథకు గ్రీన్ సిగల్ ఇచ్చారు.

ఇదొక పూర్తిస్థాయి ఎంటర్టైనర్ అని సమాచారం. బాలాజీ చెప్పిన స్క్రిప్ట్ వరుణ్ తేజ్‌కు బాగా నచ్చడంతో వెంటనే ఓకే చెప్పారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. తన సొంత బ్యానర్ స్టోన్ బెంచ్ క్రియేషన్స్ ద్వారా ఈ సినిమాలో సహ నిర్మాతగా కూడా ఆయన భాగస్వామి అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రకటన చిత్రబృందం త్వరలో విడుదల చేయనుంది.







# ఎందుకిలా?

## - సొంతగడ్డపై భారత్ తడబాటు సవాళ్లను అధిగమించటంలో వెనుకంజ

న్యూఢిల్లీ : 231/5, 238/7, 271/5. టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ముందు భారత్ తొలుత బ్యాటింగ్ చేసిన మ్యాచ్‌ల్లో చేసిన స్కోర్లు ఇవి. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన చివరి మూడు మ్యాచ్‌ల్లో 209 లక్ష్యాన్ని 28 బంతులు ఉండగానే ఊదేయగా.. 154 పరుగుల టార్గెట్‌ను 10 ఓవర్లలోనే ముగించారు. తొలుత బ్యాటింగ్ చేసినా, రెండో ఇన్నింగ్స్‌లో బ్యాట్ పట్టినా.. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వంటి మేటి జట్లపైనే సూర్యకుమార్ సేన ఈ గణాంకాలు నమోదు చేసింది.

ఆధునిక టీ20 క్రికెట్‌లో అసమాన వీరోచిత బ్యాటింగ్ విన్యాసాలు భారత్‌ను ఇతర జట్లకు అందనంత ఎత్తులో నిలిపాయి. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ ఓవర్‌కు 12కు పైగా పరుగులు సాధించింది. టీమ్ ఇండియా జోరు చూశాక.. టీ20 ప్రపంచకప్‌లో 300 పరుగుల స్కోరు ఖాయమనే భావన కలిగింది. గ్రూప్ దశలో చిన్న జట్లు సైతం పోటీలో ఉండగా.. భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంటే 300 కొట్టవచ్చనే అంచనాలు బలంగా వినిపించాయి. టీ20 ప్రపంచకప్‌లో అంచనాలు తలకిందులు అయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అసలు సమరంలో పూర్తి భిన్నంగా ఆడుతోంది. వరల్డ్‌కప్‌కు ముందు చూపించిన విన్యాసాల్లో ఇప్పుడు సగమైనా కనిపించటం లేదు. అందుకు కారణాలు లేకపోలేదు!.

టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో గత రెండేళ్లుగా భారత్ ఎక్కువగా స్వదేశంలో టీ20 సిరీస్‌లు ఆడింది. భారత్ ఆడిన పిచ్‌ల్లో వైవిధ్యం లోపించింది. సహజంగా భారత్‌లో పిచ్‌లు తొలుత ఫ్లాట్‌గా ఉంటాయి. మంచు కురిసే కొద్ది బ్యాటింగ్‌కు మరింత అనువుగా మారుతుంది. దీంతో ఛేదన సులభతరం అవుతుంది. ప్రపంచకప్ పిచ్‌లు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీనికి తోడు దక్షిణాఫ్రికా బౌలర్లు మెరుగైన సన్నద్ధత ఆ జట్టుకు ఉపయోగపడింది. పేసర్లు స్లో బాల్స్‌ను తెలివిగా ప్రయోగించారు. భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్ ముంగిట ఆఫ్ స్పిన్‌పై భారత టాప్-3 బ్యాటర్ల ఆటతీరుపై ఎక్కువగా చర్చ నడిచింది. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ ఎడెన్ మార్క్రామ్ నెట్స్‌లో ఎక్కువగా బౌలింగ్ సాధన చేశాడు. ఆఫ్ స్పిన్‌ను ఎదుర్కొనేందుకు అభిషేక్, కిషన్, తిలక్ ఆశించిన స్థాయిలో సిద్ధం కాలేదు. పవర్‌ప్లే తర్వాత పరుగుల వేట కష్టమవుతుందనే భావనలో కిషన్, అభిషేక్, తిలక్ అనవసర దూకుడుకు వెళ్లారు.

ఫలితంగా ఫటాఫట్‌గా వికెట్లు పతనం అయ్యాయి. భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో మూడింట తొలి ఓవర్లోనే ఆఫ్ స్పిన్‌కు ఓపెనర్ వికెట్ కోల్పోయింది. అయినా, ఈ బలహీనతను అధిగమించేందుకు తగినంత శ్రద్ధ వహించలేదు. దక్షిణాఫ్రికా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ల కోసం అక్షర్ పటేల్‌ను పక్కనపెట్టి ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. ఆఫ్ స్పిన్ సవాల్‌కు సఫారీ బ్యాటర్లు మెరుగ్గా సిద్ధమయ్యారు. సుందర్ మాయను సులువుగా తిప్పికొట్టారు. భారత టాప్ ఆర్డర్ ఇక్కడ విఫలమైంది. ఫలితంగా భారత్ దారుణ పరాజయం చవిచూసింది.

# జిల్లా పోలీస్ గ్రీవెన్స్‌కు 123 వినతులు

- పిటీషన్ల పరిష్కారంలో జాప్యం లేకుండా నిర్దేశిత సమయంలో పరిష్కరించండి
- జిల్లా ఎస్పీ పి.జగదీష్






**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ సోమవారం నాడు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని తక్షణమే పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా...ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు మరియు వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విని మణిదీప్,అనంతపురం మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల ఆందోళన గళం మోగింది

- కనీస వేతనం రూ.26 వేలు, పదవీ విరమణకు రూ.10 వేలు పెన్షన్ డిమాండ్
- లేబర్ కోడ్స్ రద్దు చేయాలంటూ రాష్ట్రవ్యాప్త దీక్షలు
- సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



**నాయుడుపేట - సూర్య వాస్తవం :** అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్టుల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. నాయుడుపేట ఐసిడిఎస్ కార్యాలయం ముందు కూడా అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన అంగన్వాడీలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. సిఐటియు నాయకులు, యూనియన్ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీలకు నెలకు కనీస వేతనం రూ.26,000లు అమలు చేయాలని, పదవీ విరమణ అనంతరం రూ.10,000ల పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

**కార్మిక హక్కులపై ముప్పు**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని నాయకులు విమర్శించారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే సమ్మె చేసే హక్కు, సంఘం ఏర్పాటు చేసే హక్కు ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయించిన రోజువారీ కనీస వేతనం రూ.178 మాత్రమే ఉండటం దురదృష్టకరమని, ఇది జీవన వేతనమా లేక అవమాన వేతనమా అని ప్రశ్నించారు.

**ఏళ్ల తరబడి పెంపు లేదు**

2014 సంవత్సరం నుంచి ఇప్పటివరకు అంగన్వాడీల వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన సవరణలు చేపట్టాలని కోరారు. 2017 నుంచి లబ్ధిదారులకు ఆహార నిధులు కూడా పెంచలేదని తెలిపారు. పోషణ ట్రాకర్, ఈ-కేవైసీ, ఎఫ్ఆర్ఎస్ వంటి విధానాల పేరుతో పరిపాలనా ఒత్తిళ్లు పెరిగాయని ఆరోపించారు.

**సుప్రీంకోర్టు తీర్పు అమలుపై ప్రశ్నలు**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ చెల్లించాల్సి ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో గతంలో 42 రోజులపాటు అంగన్వాడీలు సమ్మె చేసినప్పటికీ పూర్తి స్థాయి మార్గదర్శకాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. కేవలం జీవో జారీ చేసి సమస్యను వాయిదా వేశారని ఆరోపించారు.

**ఐసిడిఎస్‌కు బలోపేతం అవసరం**

కేంద్ర బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు తగిన నిధులు కేటాయించక పోవడం వల్ల వ్యవస్థ బలహీనపడుతోందని అన్నారు. ఐసిడి ఎస్‌కు నిధులు పెంచి చిన్నారుల పోషణ, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**పిల్లల కోసం సేవ -- అంగన్వాడీల భవిష్యత్తు ఎవరి భాద్యత?**

దేశ భవిష్యత్తు అయిన చిన్నారుల అభివృద్ధి కోసం అంగన్వాడీలు కష్టపడి పనిచేస్తున్నప్పటికీ, వారి జీవన భద్రతపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక, ఉద్యోగ, కర్షక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన సమయంలో గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను మరింత విస్తరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, యూనియన్ ప్రతినిధులు, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలున్న పలు కాలనీల్లో పరశీలన



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలో గుంతకల్లు నియోజకవర్గ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, ఆయన కుమారుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారి డిప్యూటీ ఎంపీడీవో (ఇఒ) అశ్వర్థ నాయుడు హుటా హుటిన తన పంచాయతీ సిబ్బందితో త్రాగునీరు, శుభ్రత పరిశుభ్రతపై పట్టణంలోని సమస్యలున్న పలు కాలనీల్లో సోమ వారం సంబంధిత అధికారి డిప్యూటీ ఎంపీడీవో అశ్వర్థనాయుడు తన పంచాయతీ సిబ్బందితో వెళ్లి పరిశీలించడమైనది. కాగితాల మఖాం వీధిలో రంజాన్ మాసం కావడంతో త్రాగునీటి సమస్యతో పలు ఇక్కట్లు పడుతున్నామని ముస్లిం సోదరులు, సోదరీమణుల విన్నపం మేరకు 24 గంటల్లోపు పరిష్కరిస్తామని, వారి ఎదుటే సిబ్బందికి కొత్త పైపులైన్ చేయమని ముక్కుం జారి చేశారు. అలాగే ఎద్దులపల్లిరోడ్డు, వెంగమ నాయుడు కాలనీలలో త్రాగునీటి సరఫరా, రోడ్లు,డ్రైనేజీ నిర్మాణాల పరిష్కారం గైకొన్నారు. 20వ వార్డులో పురాతన ఊటకాలవలు కబ్జాలకు గురి కావడంతో వర్షపు నీరు, నివాసాల డ్రైనేజీ మురికినీరు బయట ప్రాంతానికి పోకుండా నిలవడంతో కుంటలను తలపిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. మురికి నీరు పోవడానికి జెసిబిని ఏర్పాటు చేసి యథావిధిగా ఊట కాలువలు తీపిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో త్రాగునీరు, పరిశుభ్రత పట్ల ఉపేక్షించదేలేదని, వీటిపై నా దృష్టికి వచ్చిన తక్షణమే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. టిడిపి పట్టణ కన్వీనర్ బొమ్మామోహన్ కృష్ణ సమస్యల ప్రాంతాలన్నీ దగ్గరుండి అధికారులకు చూపించారు. ఈ కార్యక్రమం లో ఇఒ అస్వర్తనాయుడు, బొమ్మామోహన్ కృష్ణ, మేస్త్రి సురేష్, మండ్లరాజు, ఈశ్వ రయ్య, శ్రీనివాసులు, కుమార్, వాటర్ మ్యాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఇంటర్మీడియట్ పరీక్షలలో పటిష్ట పోలీసు బందోబస్తు




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు అవాంఛనీయ ఘటనలు లేకుండా జరగేలా ఆయా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి జగదీశ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో అనధికార వ్యక్తులు గుమిగూడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బందిని నియమించి, పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు లేదా నిషేధిత వస్తువులు తీసుకురాకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా ప్రశ్నాపత్రాల రవాణా మరియు భద్రత కోసం ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఎగ్జామ్స్ సెంటర్ల పరిసర ప్రాంతాలలో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

# పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- పరీక్ష కేంద్రాల ప్రాంతాల్లో 144 సెక్షన్
- జిల్లా ఎస్పీ పి.జగదీష్





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ అనంతపురంలోని పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఎస్ ఎస్ బి ఎన్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ విధానాలను సమీక్షించారు. పరీక్ష కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ప్రశ్నాపత్రాల భద్రపరిచే విధానం, హాల్ సూపరింటెండెంట్లు మరియు ఇన్విజిలేటర్ల విధులు తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాల్ ప్రాక్టీస్, గుంపులుగా తిరగడం వంటి చర్యలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. అలాగే... పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు, అనవసరంగా గుంపులు గూడకుండా చర్యలు, ఫోటోకాపీ సెంటర్లు, జిరాక్స్ దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# సేవా కార్యక్రమాలకు సొంత భవనం అవసరం

- రోటరీ క్లబ్‌కు స్థలం కేటాయించాలని వినతి
- డిఆర్ఓ, ఆర్డీవోలను కలిసిన రోటరీ క్లబ్ ప్రతినిధులు
- ఐదు సెంట్ల స్థలం కేటాయింపుకు సానుకూల స్పందన



**నాయుడుపేట - సూర్య వాస్తవం :** పట్టణంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తరించేందుకు రోటరీ క్లబ్‌కు సొంత భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం రోటరీ క్లబ్ ప్రతినిధులు అధికారులను కలిశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ నరసింహులు, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి వారికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆదవరం నాగూరయ్య సభ్యులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. విలేకరులతో మాట్లాడుతూ అధ్యక్షుడు ఆదవరం నాగూరయ్య తెలిపారు నాయుడుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గత ఏడేళ్లుగా పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరాలు, విద్యార్థులకు సహాయ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని వివరించారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు సొంత భవనం అవసరమని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలం కేటాయించే విషయంపై ఆర్డీవో కిరణ్మయి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. సంబంధిత ప్రతిపాదనపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి బట్ట సుబ్రహ్మణ్యం, సభ్యులు చంద్రశేఖర్, హరి తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )